రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కాలుష్యంతో రోగాలు

- దిగుబడి రాని పంటలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముందు తాండ్రపాడు గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి-కర్నూలు క్రైం/కార్పొరేషన్

టిజివి ఎస్ఆర్ఎఎసి ప్రభావిత గ్రామమైన కర్నూలు మండలం ఈ తాండ్రపాడులో బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించారు. పరిశ్రమ వల్ల వస్తున్న దుష్ఫలితాల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ నుంచి వచ్చే వాసనవల్ల ఆయాసం వస్తోందని మహిళలు శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. టిజి వెంకటేష్ బకాసురుడని, అందరినీ తినేస్తాడని చెప్పారు. వాతావరణ కాలుష్యం వల్ల పంటలు పండటం లేదని, దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు వేస్తే నీళ్ల ఎర్రగా వస్తున్నాయని తెలిపారు. వ్యర్థాలను తుంగభద్రలోకి కలుపుతున్నారని చెప్పారు. పనికి పోతే స్థానికులు వద్దంటున్నారని, పరిశ్రమ కాలుష్యాన్ని భరిస్తున్నా తమకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులను వద్దంటే ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు.

హక్కులను కాపాడుకునేందుకు ముందుకు రావాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

హక్కులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ తాండ్రపాడు గ్రామస్థులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ వల్ల ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తే జబ్బులు మాత్రం వచ్చాయన్నారు. ఫ్యాక్టరీ వల్ల వచ్చిన మేలేంటని ప్రశ్నించారు. రాత్రి పూట వచ్చే వాసనతో ఆయాసం వస్తోందని, పంటలు పండక ఉద్యోగాలు రాక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దత్తత తీసుకోవడం అంటే ఊరు మొత్తం వెళ్లిపోయేలా చేయడమా అని ప్రశ్నించారు. ఫ్యాక్టరీతో లాభం వస్తుందంటే అందరూ ఆహ్వానిస్తారని, ఏ రూపంలో చూసినా లాభం కనిపించడం లేదని తెలిపారు. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కాలుష్యం వల్ల ఊరు వల్లకాడుగా మారిపోతుందన్నారు. ఎదిరించే అందరిపై కేసులు పెడుతున్నారని, తప్పుడు కేసులను గ్రామస్థులు ప్రశ్నించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పరిశ్రమ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణలో నిబంధనలు పాటించలేదన్నారు. తాము పరిశ్రమకు వ్యతిరేకం కాదన్నారు. స్థానికులను చివరికి కాంట్రాక్ట్ లేబర్‌గా కూడా తీసుకోవడం లేదన్నారు. స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో జాబితా బయటపెట్టాలన్నారు. స్థానికులకు ఉద్యోగాల కోసం గ్రామస్థులు పోరాడాలని, సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవినారాయణ, ఎండి ఆనంద్‌బాబు, టి.రాముడు, కర్నూలు ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, వై నగేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ అబ్దుల్లా, కర్నూలు మండల కార్యదర్శి హుసేనయ్య, ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీరా పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న ఈ.తాండ్రపాడు గ్రామస్తులు

తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సిపిఎం నాయకులు, మోటార్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ ఇంఛార్జి వడ్ల వెంకటేశ్వర్లుపై కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కలెక్టర్ పి.రంజిత్ బాషాను కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రయివేటు గూండాలతో ప్రహసనంగా జరిగిన టిజివి ఎస్ఆర్ఎఎసి ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి కలెక్టరేట్‌లో నిర్వహించాలని, పరిశ్రమలో వాడే రసాయనాల వివరాలు బయటపెట్టాలని, ఉద్యోగుల్లో ఎంత మంది స్థానికులు ఉన్నారో వివరాలు వెల్లడించాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్‌పితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, పరిశ్రమ విస్తరణకు అభ్యంతరాలుంటే ఇప్పుడైనా తెలపచ్చని కలెక్టర్ అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి నారాయణ, టి.రాముడు, కర్నూలు ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

- రాజకీయ పార్టీలతో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలుకలెక్టరేట్

ఓటరు నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన వారు ఓటర్ గా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు..జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్ఓ ప్రభుత్వం తరపున ఉంటారని , రాజకీయ పార్టీల తరపున బిఎల్ఎ ద్వారా అర్హులైన వారితో దరఖాస్తు చేయించి ఓటర్‌గా నమోదును చేయించాలని తెలిపారు. ఆన్ లైన్ ద్వారా ఎప్పుడైనా ఓటర్ నమోదు చేయించుకోవచ్చని ప్రతినిధులకు తెలియజేశారు. ఆన్ లైన్ ఓటర్ నమోదుకు సంబంధిత ఓటర్ ఫోన్ నెంబర్‌కు వన్ టైం పాస్వర్డ్ వస్తుందని, దాని ద్వారా ఓటర్ నమోదు చేసుకోవాలన్నారు. బిఎల్ఓల ద్వారా 15 రోజులకు ఒకసారి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం కూడా చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఇఆర్ఓలు ప్రతి కాలేజీకి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన యువత నుండి అప్లికేషన్లు తీసుకొని వారిని ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఒక కుటుంబంలోని ఓటర్ లు అందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలాగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒకవేళ ఆ విధంగా లేనిచో సంబంధిత ఫార్మ్ ద్వారా వారిని ఒకే పోలింగ్ స్టేషన్లో చేర్చే చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిజ్రాలకు ఓటు హక్కును కల్పించామని, మిగిలిన వారి చిరునామాలు అన్నీ సేకరించుకొని ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఓటు హక్కు కల్పించడానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు కార్యక్రమం లో పాల్గొని ఓటరుగా నమోదు చేసుకునే విషయాన్ని ప్రభుత్వం ప్రచారం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీలు కూడా ప్రచారం చేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున మాలిక్ బాషా, బిజెపి తరపున సాయి ప్రదీప్, సిపిఐ(ఎం) తరపున జి.రామకృష్ణ, బహుజన్ సమాజ్వాది పార్టీ తరపున అరుణ్ కుమార్, జనసేన పార్టీ తరపున మంజునాథ్ పాల్గొన్నారు.

నేడు సిల్వర్ సెట్ పరీక్ష

- కర్నూలు, ఎమ్మిగనూరులో పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీ కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ప్రవేశానికి గాను సిల్వర్ సెట్ పరీక్షా కేంద్రాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏడు పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను గురువారంఉదయం 10.00 నుంచి 11.30, మధ్యాహ్నం 2:30 నుంచి 4:00గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పరీక్ష రాయడానికి పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు ఉండాలన్నారు. కర్నూలులో జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఎమ్మిగనూరులో సెయింట్‌జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు.

బస్సుపై గుడిగంటతో దాడి

- ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- వెల్దుర్తి

గుడిలో గంటను కొడతారు.. అయితే అదే గంటతో గుర్తుతెలియని వ్యక్తి వెళుతున్న బస్సుపై దాడి చేయడంతో ప్రయాణికురాలు గాయపడిన సంఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మంగళవారం అర్ధరాత్రి మదనపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి మదనపల్లికి వెలుతోంది. 44వ జాతీయ రహదారిలోని బొమ్మిరెడ్డిపల్లి సమీపంలో వెలుతున్న బస్సుపై గుర్తుతెలియని వ్యక్తులు గుడిగంటతో దాడి చేశారు. దీంతో దోపిడిదాడులనుకున్న బస్సు డ్రైవర్ బస్సును ఆపకుండా కొంత దూరం వచ్చి బస్సును నిలిపారు. గంటతో దాడి చేయడంతో బస్సు అద్దాలు పగిలి అందులో ప్రయాణిస్తున్న కదిరికి చెందిన భవిష్య అనే 17 ఏళ్ల అమ్మాయి తలకు తీవ్రగాయమైంది. దీంతో బస్సులో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని ఆమెకు చికిత్స చేయించారు. ఈసంఘటనపై బస్సు డ్రైవర్ మల్లికార్జున వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, సెట్కూరు సిఇఒ కె. వేణుగోపాల్, జిల్లా పర్యాటకశాఖ అధికారి విజయలు నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1983 సంవత్సరం మే రాజకీయ ప్రవేశం చేసిన తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. అనేక సంస్కరణలతో సంక్షేమ పాలన అందించారన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం ఇస్తూ దేశంలోనే విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. క్రమ శిక్షణ, పట్టుదలతో ఆయన జీవితంలో అనేక విజయాలు సాధించారన్నారు. రాజకీయ జీవితంలో విజయం సాధించి దాదాపు ఏడేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. 72 సంవత్సరాల జీవిత కాలంలో ప్రభుత్వం నుండి పద్మశ్రీ ,ఫిలింఫేర్ అవార్డులు చాలా తీసుకున్నారన్నారు.

కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిబాషా, జెసి, అధికారులు

కర్నూలు అగ్రికల్చర్: ఎన్‌టి.రామారావు జయంతి వేడుకలు జిల్లా పరిషత్ కార్యాలయంలో మినీ మీటింగ్ హాల్‌లో సిఇఒ నాసరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ సిఇఒ వెంకటసుబ్బారెడ్డి, ఎఒలు జితేంద్ర, సరస్వతి, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజ శేఖర్ సూపరింటెండెంట్ కమలాకర్ రావు, స్టెనో వెంకటేశ్వర్లు ఇంజనీర్‌లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : జిల్లా గ్రంథాలయంలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కెజి. గంగాధర రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ పాల్గొన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, టీచరు బసవరాజు, ఆఫీసు సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ యన్ మగ్బుల్ బాష, జూనియర్ అసిస్టెంట్ ఆర్ఎస్.రాజు, సువర్ణ, లైబ్రేరియన్‌లు నషీమాబీ, రేణుక, పద్మావతమ్మ పాల్గొన్నారు.

మద్దికెర : ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను మండల పరిధిలోని అగ్రహారం మెయిన్ బజారు టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బర్డ్‌డే కేక్ ను కట్ చేసి పిల్లలకు పంచి పెట్టారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెద్ద ఈరన్న, మాజీ ఎంపిటిసి రమేష్, మాజీ వైస్ సర్పంచి దస్తగిరి, ఎర్రిస్వామి, టిడిపిమండల ఎస్‌సిసెల్ నాయకులు ఆనంద్ కుమార్, బందెల రాంబాబు, పాల్గొన్నారు.

కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఎన్‌టిఆర్ జయంతి మార్కెట్ యార్డ్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీనటుడుగా, సిఎంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. అసిస్టెంట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్స్ కేశవరెడ్డి, నగేష్, శివన్న, అకౌంటెంట్ కిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డులో ఎన్‌టిఆర్‌కు నివాళి అర్పిస్తున్న జయలక్ష్మి, సిబ్బంది

ఎన్‌టిఆర్‌కు నివాళి అర్పిస్తున్న కళాకారులు పత్తిఓబులయ్య, తదితరులు

ఎన్‌టిఆర్ నటన కళాకారులకు వరం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : ఎన్‌టిఆర్ నటన రంగస్థల కళాకారులకు ఒక వరం వంటిదని పలువురు కళాకారులు కొనియాడారు. బుధవారం టిజివి కళాక్షేత్రంలో ఎన్‌టిఆర్ 102 వ జయంతి సభ నిర్వహించారు. టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి ప్రసంగించారు. ఆయన నటన పౌరాణిక, సాంఘిక, చారిత్రక సినిమాలలో ఒక ప్రత్యేకమైనదన్నారు. నటనతో దేశాన్ని ఆకట్టుకున్నారన్నారు. రంగస్థలం కళాకారులు మహమ్మద్ మియా, జీవీ శ్రీనివాసరెడ్డి, పాండురంగయ్య, వివి.రమణారెడ్డి, యాగంటి ఈశ్వరప్ప, బలరాముడు, కెవి.రమణ ఈశ్వరయ్య రాజారత్నం, కృష్ణ పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్ మధుసూదన్ డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్ మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయంలోని వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతులకు నకిలీ విత్తనాలను సరఫరా చేయకుండా చూడాలన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాసుంబాష, మల్లేష్, చిన్న మద్దయ్య, ఆంజనేయులు, హరి, జయకుమార్, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మద్దికేర

వేరుశనగ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మద్దికేర మండలానికి 580 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు అయినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాలలో ఒక రైతుకు 90 కిలోల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. క్వింటాకు మొత్తం ధర రూ.9300, సబ్సిడీ ధర 3720, రైతులు చెల్లించాల్సిన ధర రూ.5580 చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ తీసుకొని స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

30న రవీంద్రలో ఉద్యోగ జాబ్ మేళా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 30న రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జి. పుల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30న ఉదయం 9:30గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.ఈ జాబ్ మేళాలో 16 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుతుక్రమ పరిశుభ్రత పై అవగాహన అవసరం

డిఎంహెచ్ఒ డాక్టర్ పి శాంతి కళ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరం వడ్డేగేరి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధి 29 వ సచివాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పి. శాంతి కళ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దీనిని 2013 మే 28న జర్మనీకి చెందిన వాష్ యునైటెడ్ అనే ఎన్జీవో సంస్థ ప్రారంభించిందని, అప్పటి నుండి ప్రతి సంవత్సరం మే 28న ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం నిర్వహించుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం 'టుగెదర్ - పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్ ' అను నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నెలసరి అనేది సాధారణంగా 9 నుండి 14 యేళ్ల అమ్మాయిలలో మొదలవుతుందని , దాదాపుగా ప్రతి నెల 3 నుండి 5 రోజులవరకు అవుతుందన్నారు. ఇది వయస్సు పెరుగుదలలో భాగంగా జరిగే సహజ ప్రక్రియ అని అమ్మాయిలకు అవగాహన కల్పించి వారిని ఆందోళనకు గురి కాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ ఉమా , డిఐఒ డాక్టర్ నాగ ప్రసాద్ బాబు ,డెమో శ్రీనివాసులు శెట్టి , డిపిఒ విజయరాజు, వైద్యాధికారి డాక్టర్ వెంకట ప్రవీణ్ , ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

డాక్టర్ శిరీషా, జిల్లా సంచార చికిత్స ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రఘు మాట్లాడుతూ సమాజంలో ఇప్పటికీ నెలసరి సమయంలో వంట చేయకూడదని, పూజ గదిలో వెళ్లకూడదని, నిల్వ పచ్చళ్ళజాడీలను ముట్టు కూడదని, శుభకార్యాలకు హాజరు కాకూడదని, పాఠశాలలకు వెళ్లకూడదని అను అపోహలు ఉన్నాయని వీటిని ప్రజలు పారదోలాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్రీయ కిషోర్ స్వస్థ కార్యక్రమ కన్సల్టెంట్ మల్లికార్జున, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప హెల్త్ సూపర్వైజర్స్ ఉమాబాయి, కమాల్ సాహెబ్, కోడుమూరు సిహెచ్ సి- ఆర్‌కెఎస్‌కె కౌన్సిలర్ శ్వేత, ప్రాజెక్టనీస్ట్ ఖలీల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

కోడుమూరులో అవగాహనా ర్యాలీ

కోడుమూరు రూరల్ : కోడుమూరు జంగాల పేటలోని 5వ హెల్త్ వెల్నెస్ సెంటర్ లో " రుతు క్రమం ఆరోగ్యం , పరిశుభ్రత దినోత్సవం పై అవగాహన ర్యాలీ కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోడుమూరులో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

ఉపాధిహామీ చట్టం నిర్వీర్యానికి కుట్ర

ప్రజాశక్తి-పత్తికొండ

గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు పోరాడి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే కార్యక్రమానికి ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయని,ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని, దీనిని కాపాడుకునేందుకే ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆ సంఘం పత్తికొండ రెవెన్యూ డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఈశ్వర రెడ్డి భవన్‌లో ఆ సంఘం జిల్లా నాయకులు బి.బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. వీరశేఖర్ మాట్లాడుతూ ఉపాధి నిధులు కోత ,సాంకేతిక కారణాలతో పని దినాలు కుదింపు, నెలలు తరబడి పనిచేసిన కూలీల వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఉపాధి హామీ చట్టాన్ని పిచ్చికుక్కని చేసి చంపే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఉపాధి కూలీలు పనిచేసిన బకాయిలను ప్రభుత్వం తక్షణమే వారి ఖాతాల్లోకి జమ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ ఉపాధి కూలీలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది పనులు కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్ వేధింపులు ఆపాలన్నారు. సంఘం జిల్లా నాయకులు శ్రీరాములు, దస్తగిరి, అయ మండలాల కార్యదర్శులు మహబూబ్ బాషా, రంగరాజు, రామాంజనేయులు, మండల నాయకులు బజారి,కెపి రాముడు, మల్లి, రాజశేఖర్, నాగరాజు, శివ, తుగ్గలి శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్

'ఉపాధి'లక్ష్యాలు సాధించకుంటే చర్యలు

-నలుగురు ఎంపిడిఒలు, ఎపిఒలకు షోకాజ్ నోటీసులు

-జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ లోలక్ష్యాలు సాధించని అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను హెచ్చరించారు. బుధవారం ఉపాధి హామీ పథకం అమలుపై స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, ఎపిడిలు ,ఎపిఒలు తదితర అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి రోజు లక్ష 50 వేల మంది కూలీలకు పనులు కల్పించే విధంగా లక్ష్యాల్ని నిర్దేశించామని, అందులో కేవలం లక్ష 3 వేల మంది మాత్రమే హాజరు అయ్యారన్నారు. ఈరోజు పనులకు కల్పించి నిర్దేశించిన లక్ష్యాల్లో గోనెగండ్ల, తుగ్గలి, ఆదోని, పత్తికొండ మండలాలు చాలా వెనుకబడి ఉన్నారన్నారు.. ఇప్పటివరకు ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు పనులు కల్పించడంలో మద్దికెర, సి.బెళగల్, తుగ్గలి, గూడూరు, పత్తికొండ, వెల్దుర్తి మండలాలు 60 శాతం పైగా పనులు కల్పించి చాలా బాగా పురోగతి సాధించాయన్నారు. హాలహర్వి, కౌతాళం, హొళగుంద, గోనెగండ్ల లాంటి మండలాలు మాత్రం 40 శాతం లోపల పనులు కల్పిస్తూ చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏప్రిల్ నుండి జూన్ వరకు కేటాయించిన లక్ష్యాలకు గాను ఇప్పటివరకు 40 శాతం కంటే తక్కువ లక్ష్యాల్ని సాధించిన హాలహర్వి, కౌతాళం, హొళగుంద, గోనెగండ్ల మండలాల ఎంపిఒ, ఎపిఒలకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డ్వామా పిడిని ఆదేశించారు. ఎమ్మిగనూరు, ఆస్పరి, ఆదోని, నందవరం, ఓర్వకల్లు, ఆలూరు, పెద్దకడుబూరు మండలాలు 50 శాతం లోపు లక్ష్యాలు సాధించారని, పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఒ లను ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే సగటు వేతన రేటులో కూడా చాలా వెనుకబడి ఉన్నామని 19వ స్థానంలో ఉన్నామన్నారు. గత ఏడాదిలో 2వ స్థానంలో ఉన్నామని ఇప్పుడు ఈ విధంగా వెనుకబడి ఉండడానికి గల కారణాలు ఏంటని కలెక్టర్ ఎంపిడిఒలను ప్రశ్నించారు. కౌతాళం మండలంలో సగటు వేతన రేటు 229, ఆదోని మండలంలో సగటు వేతన రేటు 237, కోసిగి మండలంలో సగటు వేతన రేటు 248, పెద్ద కడుబూరు మండలంలో సగటు వేతన రేటు 248 ఉందని, రూ.300 ఇవ్వాల్సిన చోట ఇంత తక్కువ ఇవ్వడానికి గల కారణాలు ఏంటి అని ఆదోని ఎపిడి సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు.గూడూరు,చిప్పగిరి, నందవరం, దేవనకొండ, ఓర్వకల్లు మండలాలు కూడా సగటు వేతన రేటు పెంచడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు.

హైదరాబాద్‌లో సి బెళగల్ వాసి మృతి

ప్రజాశక్తి-సి బెళగల్ : హైదరాబాద్ కు వలస వెళ్లిన సి బెళగల్ దళిత వాడ వాసి షడ్రక్ (35) గచ్చిబౌలి దగ్గర రోడ్డు దాటుతూ ఆర్‌టిసి బస్సు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం సాయంత్రం జరగ్గా అనుమానాస్పద మృతి కింద రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆచూకీ కోసం ఉస్మానియా హాస్పిటల్ లో మృతదేహం తరలించి పత్రికలలో వేయించారు. బుధవారం బెళగల్ లోని వలస కూలీలు హైదరాబాద్ లో పత్రిక ద్వారా గుర్తించి కుటుంబికులకు తెలిపారు.దీంతో రాజారెడ్డి వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి పంపే ఏర్పాట్లు చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యోగాతో ఒత్తిడి మాయం

- మున్సిపల్ ఛైర్పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

యోగాతోనే శారీరక, మానసిక ప్రశాంతత లభించి, అనారోగ్య సమస్యలు దూరమవుతాయని, ఒత్తిడి మాయమవుతుందని మున్సిపల్ ఛైర్పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మున్సిపల్ మైదానం నుంచి ప్రభుత్వాస్పత్రి మీదుగా మున్సిపల్ రోడ్డులో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆధునిక, సాంకేతిక యుగంలో మనిషికి మానసిక ప్రశాంతత కరువయ్యే పరిస్థితి నెలకొందన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఒత్తిడిని అధిగమించి ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. సమయం దొరికినప్పుడల్లా యోగాసనాలు చేయాలని సూచించారు. వచ్చిన వారితో వివిధ భంగిమలతో యోగా చేయించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ చలపతి రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఎంఇఒ శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు రంజిత్ కుమార్, నాగరాజు, ఆర్వ పెద్దయ్య, విఆర్ఒ రాజశేఖర్ గౌడ్, హెల్త్ యూనిట్ ఆఫీసర్ మంజునాథ్, సూపర్వైజర్లు థోర్తి, మేరీ, అరుణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌డిటి ఎడి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న సరస్వతి

ఆర్‌డిటి ట్రస్టు ఎడి సరస్వతి వై.బాలనాగిరెడ్డిని, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో కోసిగి మండల ఎటిఎల్ కృష్ణయ్య కలిసి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్‌డిటి సంస్థ ద్వారా అందించే సేవా కార్యక్రమాలకు తమవంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు.

65 ఏళ్లు పైబడిన వారికే డోర్ డెలివరీ

- ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి - చిప్పగిరి

రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

చౌక దుకాణాల ద్వారా జూన్ 1 నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ ప్రక్రియ మొదలవుతుందంతో 65 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే డోర్ డెలివరీ చేయాలని, మిగతా వారందరూ రేషన్ దుకాణాల దగ్గరకొచ్చి తీసుకోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. బుధవారం చిప్పగిరి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి డీలర్ కూడా రేషన్ ప్రక్రియ సజావుగా నడపాలని సూచించారు. రెవెన్యూ అధికారులంతా ఈ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా చూసుకోవాలన్నారు.

వెల్లాపురంలో రీ సర్వే పరిశీలన : మండలంలోని వెల్లాపురం గ్రామంలో రీసర్వే జరుగుతున్న తీరును తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆకస్మికంగా పరిశీలించారు. రీ సర్వే వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... రీ సర్వేను రైతులకు ఎక్కడా సమస్యలు ఎదురవకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను సూచించారు. మండల సర్వేయర్ నారాయణ, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఆర్ఐ సునీత, జూనియర్ అసిస్టెంట్ వీరేష్, వీఆర్ఒలు మల్లికార్జున, గోవిందయ్య, పెద్దన్న, అంజి, వన్నూర స్వామి, సునీత, విలేజ్ సర్వేయర్ హనుమా నాయక్, సచివాలయ సర్వేయర్లు వినోద్ కుమార్, గోవర్ధన్, అశ్విని, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్ల అవగాహన అవసరం

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పారిశుధ్యం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, పార్కు రోడ్డు, ట్యాంకు బండ్ రోడ్, కమిటీ రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు చెత్తను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు.

పడని బిల్లులు...

- లబ్ధిదారుల ఎదురుచూపులు
- అప్పు చేసి గోకులం షెడ్లు నిర్మించాం
- వడ్డీలు పెరుగుతున్నాయని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఆస్పరి

గోకులం షెడ్లకు సంబంధించి రైతులకు బిల్లులు పడటం లేదు. నిర్మాణాలు పూర్తి చేసిన రైతులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టామని, అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తంగరడోన గ్రామంలో గోకులం షెడ్డు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయం, పాడి పశువులను నమ్ముకొని జీవిస్తున్నారు. గత ప్రభుత్వం పాడి పశువుల పట్ల నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పశుపోషకుల దృష్టిలో పెట్టుకొని సబ్సిడీతో గోకులం షెడ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించింది. చాలామంది షెడ్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆస్పరి మండలంలో 51 మంది రైతులకు ప్రభుత్వం షెడ్లు మంజూరు చేసింది. 28 షెడ్లు పూర్తి కాగా, 14 రూఫ్ లెవెల్లో ఉన్నాయి. 3 వివిధ దశల్లో ఉన్నాయి. 6 షెడ్లు వివిధ కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదు. హాలిగేర గ్రామంలో తలారి నల్ల గుట్టయ్య ఆరు పశువులకు రూ.2.30 లక్షలకు గాను రూ.1.05 లక్షలు, చొక్కనహల్లి గ్రామంలో గొల్ల చిన్న నాగమ్మ ఆరు పశువులకు రూ.2.30 లక్షలకు గాను రూ.1.05 లక్షలు మాత్రమే ఇప్పటి వరకు విడుదలయింది. షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. 8 నెలలు గడిచినా బిల్లులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గోకులం షెడ్లు పూర్తయిన వెంటనే ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్న ఆశతో అప్పులు చేసి మరీ గోకులం షెడ్లు నిర్మించుకున్నామని, బిల్లులు సకాలంలో పడకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు.

ఆరు పశువుల రైతులు 29 మందికి రూ.2.30 లక్షల చొప్పున రూ.66.70 లక్షలు, నాలుగు పశువుల రైతులు 9 మందికి రూ.1.85 లక్షల చొప్పన రూ.16.65 లక్షలు, రెండు పశువుల రైతులు 13 మందికి రూ.1.15 లక్షల చొప్పున రూ.14.95 లక్షలు, మొత్తం మండలానికి రూ.98.30 లక్షలు మంజూరయ్యాయి. 51 మంది రైతులకు సంబంధించి ఇద్దరి మాత్రమే రూ.1.05 లక్షల చొప్పన రూ.2.10 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి.

పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో గోకులం షెడ్లు నిర్మించుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు త్వరగా విడుదలయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అప్పు చేసి మరీ నిర్మించుకున్నా

- రైతు రుద్రయ్య స్వామి, తంగరడోన గ్రామం.

ఆరు పాడి పశువుల కోసం అప్పు చేసి మరీ గోకులం షెడ్డు నిర్మించుకున్నాను. 8 నెలలయినా బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలి.

బిల్లులు విడుదల చేయాలి

- రంగస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి.

పాడి పశువుల రైతులకు పెండింగ్‌లో ఉన్న షెడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి. షెడ్లు నిర్మించుకున్న వెంటనే బిల్లులు పడతాయని రైతులకు చెప్పిన కూటమి ప్రభుత్వం 8 నెలలయినా బిల్లులు వేయకపోవడం ఏమిటి. అప్పు తెచ్చి మరీ షెడ్లు నిర్మించుకున్న రైతులు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. బిల్లులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పంట రుణాలివ్వాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

రైతులకు పంట రుణాల మంజూరులో ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, వ్యవసాయ శాఖాధికారులు, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు సమయానికి పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే, వారు అర్హులైతే వెంటనే రుణం మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ విధానాల ప్రకారం అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేయడంలో ఆలస్యం జరగకుండా చూడాలని తెలిపారు. రుణాల మంజూరులో రెవెన్యూ సమస్య ఉంటే సంబంధిత తహశీల్దార్లతో నివృత్తి చేసుకొని సమస్యను పరిష్కరించి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆదోని వ్యవసాయ శాఖ అధికారి బాల వర్ధిరాజు, ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఆదోని కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ రాజేష్, రాజు, మోహన్ ఉన్నారు.

లబ్ధిదారులందరికీ రేషన్ అందిస్తాం

- తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - నందవరం

మాట్లాడుతున్న తహశీల్దార్

మండలంలోని లబ్ధిదారులందరికీ రేషన్ అందేలా కృషి చేస్తామని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. ఇప్పటివరకు ఎండియు వ్యవస్థ ద్వారా వీధిలోకి వెళ్లి ప్రజలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండియు వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందిస్తామని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు నిత్యావసర సరుకులు అందిస్తారని చెప్పారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు రేషన్ అందేలా చూడాలని సూచించారు. 65 ఏళ్లు పైబడిన లబ్ధిదారులకు, వికలాంగులకు ఇంటి దగ్గరకే డీలర్లు రేషన్ అందిస్తారని తెలిపారు. రేషన్ షాపులో నిర్వహించే రేషన్ కాటాను, మిషన్ పనితీరును తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలించి డీలర్లకు అందించారు.

కాటా, మిషన్‌ను అందిస్తున్న తహశీల్దార్

కర్ణాటక మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - మంత్రాలయం

అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేసినట్లు సిఐ రామాంజులు తెలిపారు. 4 కేసుల్లో పట్టుబడిన 3500 టెట్రా ప్యాకెట్లను బుధవారం నాగలదిన్నె రహదారిలో ఉన్న సుంకప్ప తాత దర్గా సమీపం లో ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్లు సిఐ తెలిపారు. దీని ధర బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.2.10 లక్షలు ఉంటుందని చెప్పారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ, విఆర్ఒ భీమనగౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, ఎంవి.రమణ, పోలీసు విజయ్ కుమార్, విఆర్ఎ నరసయ్య పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సాంకేతికతతో కూడిన విద్య మా ప్రత్యేకత

- సాయి భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ దుర్గేష్

ప్రజాశక్తి - ఆదోని

ఆధునిక ప్రపంచానికి అనుగుణంగానే సాంకేతికతతో కూడిన విద్యనందించడం సాయి భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రత్యేకత అని స్కూల్ కరస్పాండెంట్ దుర్గేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలోని ఆహ్లాదకరమైన వాతావరణం లో చిన్నారులకు రాకపోకలకు ఇబ్బంది లేని ప్రాంతంలో పాఠశాల నెలకొల్పామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తున్నామన్నారు. రోబోటిక్ విధానంలో 3 నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక విద్య బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశలోనే హార్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును పరిచయం చేస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో శ్రీలక్ష్మి 572 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారని తెలిపారు. 500కు పైగా మార్కులు 20 మంది, 400కుపైగా 18 మంది, వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అనుభవం, అంకితభావం, అర్హత కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్య బోధన జరుగుతోందని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ చదువు పట్ల ఆసక్తి పెంచుతూ మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఎలాంటి శబ్ద కాలుష్యం లేని, ప్రశాంత వాతావరణంలో తమ స్కూలు కొనసాగుతోందని, విద్యార్థుల భవిష్యత్తు తమ బాధ్యతగా తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు.

ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ముద్దటమాగి గ్రామంలో ఇసుక రీచ్‌కు సంబంధించి బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ముద్దటమాగి గ్రామ శివారులోని వేదవతి నదిలో సర్వే నెంబర్ 127 భూమిలో 7,814 హెక్టార్లలో 78,140 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు చేపట్టడంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. గ్రామం మీదుగా ఇసుక వాహనాలు వెళ్లేందుకు వీల్లేదని, మార్లమాడికి మీదుగా వెళితే తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదని తెలిపారు. అనంతరం సులువాయిలో జరిగే రీసర్వే తీరును సబ్ కలెక్టర్ పరిశీలించారు.

సమస్యల వెల్లువ

ముద్దటమాగి గ్రామంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు వచ్చిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు గ్రామస్తులు సమస్యలు చెప్పుకున్నారు. నెల రోజులుగా తాగునీటి సరఫరా లేదని, మురుగు కాలువలు, పారిశుధ్య పనులు చేపట్టలేదని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

విలేకరిపై బెదిరింపులకు పాల్పడిన కార్యదర్శి

సమస్యలు చెప్పకుంటున్న గ్రామస్తులు

ముద్దటమాగి గ్రామస్తుల సమస్యలను వీడియో ద్వారా చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి విలేకరిపై మార్లమాడికి పంచాయతీ కార్యదర్శి బెదిరింపులకు పాల్పడ్డారు. 'వీడియో ఎందుకు తీస్తున్నావ్' అంటూ నానా దుర్భలాషలాడారు. 'ఇక్కడ సమస్యలేమీ లేవు. నువ్వు ఇక్కడి నుంచి వెళ్లి పో. లేదంటే నీపై కేసు పెడతా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను చెప్పకొనేందుకు తామే విలేకరిని పిలిపించామని, కేసు ఎందుకు పెడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రశ్నించే విలేకరులపై బెదిరింపులకు పాల్పడడంపై ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు మండిపడ్డాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని, ఆ ఉద్యోగికి సూచనలు ఇవ్వాలని కోరాయి. తహశీల్దార్ నిజాముద్దీన్, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

దేవరగట్టు హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - హోళగుంద

దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దేవాలయానికి చెందిన హుండీ లెక్కింపు చేపట్టినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బోయ మల్లికార్జున, తిమ్మప్ప, మాజీ ఎంపిటిసి నర్సానాయక్, రాజశేఖర్ గౌడ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. రెండు నెలల హుండీలు లెక్కించగా రూ.1.20 లక్షల నగదు, రెండు వెండి గుర్రాలు వచ్చినట్లు తెలిపారు.

తెర్నేకల్‌లో భగీరథ భవన్ ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో భగీరథ భవనాన్ని జిల్లా వినియోగదారుల పరిష్కార కౌన్సిల్ డైరెక్టర్ నారాయణ రెడ్డి, భగీరథ సగర ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షులు సత్యన్న, సర్పంచి మొగతాలి అరుణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. భవన నిర్మాణానికి నారాయణ రెడ్డి ఆర్థిక సహాయంగా రూ.5,11,116 అందించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మహానాడుకు తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - ఆదోని

కడపలో జరుగుతున్న మహానాడుకు ఆదోని నుంచి టిడిపి నాయకులు భారీగా తరలి వెళ్లారు. టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పయనమయ్యారు. మంగళవారం నుంచి గురువారం వరకు మహానాడు కార్యక్రమం ఉంటుందని సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం భారీ బహిరంగ సభతో కార్యక్రమం ముగుస్తుందని చెప్పారు. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తారని, ఆయన ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపారు. టిడిపి మైనార్టీ నాయకులు సౌదీ రావుఫ్, రామచంద్ర, సోమశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రామకృష్ణ, సీన, గోవిందు, ఎన్‌బికె ఫ్యాన్స్ సీనియర్ నాయకులు నాగరాజు, మల్లేశప్ప ఉన్నారు. **మంత్రాలయం** నియోజకవర్గం నుంచి మహానాడు సభకు తెలుగు తమ్ముళ్లు బయల్దేరి వెళ్లారు. టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి యువ నాయకులు రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కౌతాళం సురేష్ నాయుడు, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డితో కలిసి తరలి వెళ్లారు.

పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించాలి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

వాతావరణ ప్రభావిత పంటల బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, రైతులపై బీమా పేరుతో ఆర్థిక భారాన్ని తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, పట్టణ కార్యదర్శి ముక్కెళ్ల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ముందు సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు, రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంటల బీమా మొత్తాన్ని రైతులే చెల్లించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో వారిపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. పత్తి పంటకు ఎకరాకు రూ.2 వేలు, వేరుశనగకు రూ.600 చొప్పున, ఇతర పంటలకు ఆయా కంపెనీలు నిర్దేశించిన మొత్తంలో పంటల బీమాను రైతులే చెల్లించాలని బ్యాంకు అధికారులు తెలియజేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పంటల బీమాను ప్రభుత్వాలే చెల్లించేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక గత రబీ సీజన్ నుంచి రైతుల చెల్లించాలన్న జిఒ విడుదల చేయడం బాధాకరమని పేర్కొన్నారు. పావలా వడ్డీ పథకానికి సంబంధించిన మొత్తాన్ని కూడా బ్యాంకుల్లో జమ చేయకపోవడంతో రైతులు వడ్డీ చెల్లిస్తున్నారని తెలిపారు. కొత్త పంట రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు రుణ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో రైతులను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు రంగన్న, మహేంద్ర, మహేష్ బండ్లయ్య, రాము, రంగడు, నాగన్న, కుమార్, రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, కౌన్సిలర్ పార్వతి, నాయకులు రంగన్న, రంగస్వామి నాయుడు, రామస్వామి, సిద్ధార్థ నాయుడు, వెంకటేష్, జయరామ్, మల్లికార్జున, మాజీ కౌన్సిలర్ అంజి, మహిళా నాయకులు అంజనమ్మ, చాంద్, వీరేష్, నారాయణ, జగదీష్, ఈరన్న, బాలస్వామి ఉన్నారు. **మంత్రాలయం** మండలంలోని మాధవరం గ్రామంలో టిడిపి కార్యాలయం వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలం బాషా, భీమా రెడ్డి, కేశయ్య, రాఘప్ప, ఉరుకుంద పాల్గొన్నారు.

దేవనకొండలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ గ్రూపులకు చెందిన టిడిపి నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. జయంతి వేడుకల్లో కూడా మండల నాయకుల మధ్య సఖ్యత కొరవడడంతో కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీరభద్ర గౌడ్ గ్రూపునకు చెందిన టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, భాస్కర్, రాజయ్య, రాజాసాబ్, చిన్న రాముడు, నాగేష్, మహేష్, రుద్ర గౌడ్, సుభాన్, మజీద్, కుక్కల తిమ్మయ్య, వైకుంఠం శివప్రసాద్ గ్రూపునకు చెందిన టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, బండ్లయ్య, తిమ్మయ్య పాల్గొన్నారు.

దేవనకొండలో నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఆయన సేవలను కొనియాడారు. టిడిపి మండల సీనియర్ అభిమానులు బసయ్య, నారాయణ, నాగరాజు, తిప్పయ్య, కొవ్వు రెడ్డి, సిద్ధయ్య పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ రంగస్వామి, ఎఎస్ఒ రామాంజనే యులు, విఆర్ఒలు హరి నాయక్, మాబు సుభాన్, బలరామ్, సుధాకర్, సిబ్బంది మధు, హరి బాబు, మద్దిలేటి పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ పాల్గొన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న భూపాల్ చౌదరి

కోసిగిలోని కొండగేని ప్రాంతంలో ఎన్‌టిఆర్ అభిమాని డీలర్ నరసన్న, కొండగేని వీరారెడ్డి, మారెప్ప ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆస్పరిలో...


చిప్పగిరిలో

కోసిగిలో...

ట్రాఫిక్, ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- పట్టణ సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బారికేడ్లు అందిస్తున్న భారతి సిమెంట్ సిబ్బంది

బారికేడ్లు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టనున్నట్లు పట్టణ సిఐ శ్రీనివాసులు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలో శ్రీసాయి రాఘవేంద్ర ట్రేడర్స్ ఆధ్వర్యంలో భారతి సిమెంట్ కంపెనీ రాయలసీమ డిప్యూటీ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, టెక్నికల్ ఓబుల్ రెడ్డి, కరణ దేవేంద్ర రెడ్డి, జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఇక్బాల్, టెక్నికల్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్ సౌజన్యంతో పట్టణ, గ్రామీణ పోలీసు స్టేషన్‌లో సుమారు 20 బారికేడ్లను అందించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. సామాజిక సేవలో భారతి సిమెంట్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈఏడాది ట్రాఫిక్ నియంత్రణ దిశగా ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాల నివారించే చర్యలో భాగంగా బారికేడ్లను అందిస్తున్నట్లు చెప్పారు. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 15, రూరల్ పరిధిలో 5 బారికేడ్లను అందించినట్లు తెలిపారు. సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పోలీసులు రఘునాథ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల సొమ్ము స్వాహా

- సిఇఒపై చర్యలేవి..? - సుప్రీంకోర్టు న్యాయవాది పురుషోత్తం రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రిని కలిసిన నాయకులు

మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో ఉన్న వ్యవసాయ పరపతి సంఘంలో రైతుల సొమ్ము రూ.2 కోట్లు స్వాహా చేసిన సిఇఒ వెంకటేశ్వర్లుపై చర్యలేవని సుప్రీంకోర్టు న్యాయవాది బి.పురుషోత్తం రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కల్లుదేవకుంట, చిలకలడోణ, వగరూరు, తిమ్మాపురం, మాలపల్లి, చౌళహల్లి గ్రామాల రైతులకు అవసరమైన సేవలందించేందుకు ప్రభుత్వం కల్లుదేవకుంట గ్రామం కేంద్రంగా సుమారు 3 వేల మంది రైతులతో వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సిఇఒ వెంకటేశ్వర్లు సుమారు రూ.2 కోట్లు స్వాహా చేశారని, జిల్లా సహకార సంఘానికి ఫిర్యాదు చేశారని చెప్పారు. లోకాయుక్తలో కూడా పిటిషన్ దాఖలు చేశారని, తూతూమంత్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సొసైటీలో అవకతవకలు జరిగాయని ఒప్పుకొన్నట్లు కూడా సిఇఒ సంతకం చేశారని తెలిపారు. డిసెంబర్ 18, 2024న మెమో జారీ చేసినట్లు చెప్పారు. రూ.20 లక్షలు రికవరీ చేసినట్లు తెలిసిందని, తాత్కాలికంగా డిసెంబర్ 23, 2024న విధుల నుంచి తప్పించారని పేర్కొన్నారు. విధులకు దూరంగా ఉంచినా పూర్తి స్థాయిలో తొలగించలేక పోయారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో వైసిపి నాయకులు, నేటి టిడిపి నాయకులు ఆయనకు వత్తాసు పలుకుతూ రక్షించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే మంచాల వ్యవసాయ పరపతి సంఘంలోనూ సిఇఒ ఖాజా హుస్సేన్ అవినీతికి పాల్పడుతూ రూ.కోట్లకు పడగలెత్తారని విమర్శించారు. ఆయనపైనా విచారణ జరిపించాలని కోరారు. ఇటీవల ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, బిజెపి జిల్లా అధ్యక్షులు రామకృష్ణతో కలిసి ఫిర్యాదు చేశామని చెప్పారు.